

ఈద్ ముబారక్



భట్టిప్రోలులోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు..

- ముగిసిన కఠోర ఉపవాస దీక్ష
- కాంతులీనిన మసీదులు
- ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు
- భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్
- ఆత్మీయ ఆలింగనాలతో ఈద్ ముబారక్

భట్టిప్రోలు: రంజాన్ మాసం కఠిన ఉపవాస దీక్ష ముగించుకుని ముస్లింలు శనివారం ఈద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి.. ఈద్గాలకు, మసీదులకు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అనంతరం తమ పూర్వీకుల సమాధుల వద్ద పూలు ఉంచి ప్రార్థనలు చేశారు. ఫిత్రా దానాలు చేశారు. మత పెద్దలు ఖురాన్ సారాంశాన్ని, రంజాన్ పర్వదిన విశిష్టతను తెలియజేశారు. బట్టిప్రోలు మండలంలోని అద్దేపల్లి, వేమవరం, పల్లెకోన, వెల్లటూరు మసీదులు విద్యుత్ కాంతులీనాయి. భట్టిప్రోలులోని ఓబిద్ మహల్లా, జామియా మసీదు, అద్దేపల్లిలోని పెద్ద మసీదులో సామూహిక ప్రార్థనలు చేశారు.

యడ్లపల్లిలో..

చుండూరు మండలం యడ్లపల్లిలో జెండా చెట్టు వద్ద ముస్లిం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అలంకరణ ఆకట్టుకుంది. చినపరిమిలోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు.

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు, నది ముల్లాయపాలెం, కోడూరు, పిట్టలవానిపాలెం, ఖాజీపాలెం గ్రామాల్లోని మసీదులలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎంపీపీ షేక్ బాజి, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అహ్మద్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ నాయకులు మునీర్, టీడీపీ మండలాధ్యక్షుడు అఫ్జల్, ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

చెరుకుపల్లి: ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనల కోసం గుళ్లపల్లి మదీన మసీదు ముతవల్లి షేక్ జాన్‌సైద ఏర్పాట్లు చేశారు. కనగాల, గూడవల్లి, గుళ్లపల్లి, మెట్టగౌడవారి పాలెంలోని ఈద్గాల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.

కర్లపాలెం: కర్లపాలెం కొత్త ఇస్లాంపేట, పాత ఇస్లాంపేట, దండుబాట, ఐలాండ్ సెంటర్‌లోని మసీదులతో పాటు పేరలి, గణపవరం, నాగరాజుపాలెం గ్రామాల్లోని మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు రంజాన్ ప్రార్థనలు చేశారు. పండుగను పురస్కరించుకుని తమకు ఉన్నంతలో పేదలకు దానధర్మాలు చేశారు.

కొల్లూరు: కొల్లూరు మసీదు ప్రాంగణంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల అనంతరం క్రాప రోడ్డులోని ఈద్గా వద్దకు చేరుకున్నారు. నమాజ్ చేసి, ఉపవాసాలను విరమించారు. అనంతవరంలో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి.

నగరం: చినమట్లపూడి, పెదమట్లపూడి, కట్టవ, సజ్జావారిపాలెం, ధూళిపూడి గ్రామాల్లో రంజాన్ పర్వదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.

రేపల్లె: రంజాన్ పర్వదిన వేడుకల సందర్భంగా.. నియోజకవర్గ ప్రజలకు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. రేపల్లె పట్టణంలోని ఉయ్యూరువారిపాలెం రహదారిలోని ఈద్గాలో ముస్లింలు నమాజు చేశారు. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, ఈద్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కైతేపల్లి, బేతపూడి గ్రామాల్లోని మసీదులు, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బాపట్ల: బాపట్ల జమేదార్ పేటలో రంజాన్ పవిత్రత గురించి మత పెద్దలు వివరించారు. రంజాన్ మాసంలో పవిత్ర ఖురాన్ అవతరింపబడినదని, ఖురాన్ సంపూర్ణ మానవత్వాన్ని సమున్నత జీవన విధానాన్ని శాంతి సమత మమత మానవత్వాలను, ఇహ పరలోక సాఫల్యాలను ప్రసాదిస్తుందని మక్కా మసీదు పేష్ ఇమామ్ హాజీ షబ్బీర్ హుస్సేన్ తెలియజేశారు. ప్రార్థనలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు షేక్.సయ్యద్ పీర్ పాల్గొన్నారు.

నిజాంపట్నం:

మండలంలోని పలు గ్రామాల్లో ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. పండుగ ప్రాముఖ్యతను గురువులు ఉపదేశించారు.



కర్లపాలెం ఈద్గా వద్ద ప్రార్థన..



కొల్లూరు ఈద్గాలో నమాజు..



చినమట్లపూడిలో ప్రత్యేక ప్రార్థనలో..



నిజాంపట్నంలో ఈద్గా వద్ద ప్రార్థనలు

రంజాన్ వేడుకల్లో మంత్రి నాగార్జున



ప్రార్థనలో పాల్గొన్న మంత్రి మేరుగ నాగార్జున

జంపని(వేమూరు): జంపని గ్రామంలోని ఈద్గాలో ముస్లింలు రంజాన్ ప్రత్యేక నమాజ్ చేశారు. ప్రార్థనలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పాల్గొన్నారు. ముస్లింలు ఆయనను సన్మానించారు.

సంక్షేమ పథకాలతో ప్రజాభివృద్ధి

'గడప గడపకు' మంత్రి మేరుగ నాగార్జున



సంక్షేమ లబ్ధి కరపత్రం అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

గోవాడ(వేమూరు): ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజాభివృద్ధి జరిగిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమృతలూరు మండలంలోని గోవాడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం జరిగింది. ప్రతి గడపకు వెళ్లిన మంత్రి నాగార్జున సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు మంత్రికి విన్నవించారు. రోడ్లు కోసం ప్రతి గ్రామ సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు కేటాయించిందని, ఈ నిధులతో రోడ్లు వేయనున్నట్లు ఆయన సమాధానం ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తున్నారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి చేస్తున్నటు పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ అవినీతి రహిత పాలనే ధ్యేయంగా పని చేస్తున్నారని చెప్పారు. ఇందుకు అధికారులందరూ పూర్తి స్థాయిలో సహకరించాలని మంత్రి నాగార్జున కోరారు. ఎంపీపీ రాపర్ల నరేంద్ర, ఎంపీటీసీ దేవరకొండ సత్యవలి, నూతల పాటి సురేష్, చేకూరి వెంకటలక్ష్మయ్య చౌదరి, మండవ శ్రీరామ్మూర్తి, ఆలపాటి రత్నగిరి, పాటిబండ్ల సీతరామయ్య, ఆలపాటి రమాదేవి, యిర్మియ్య, బందెపూడి ఇశ్రాయేలు, బందెల చెత్తయ్య, బేతపూడి రాజేష్, పాములు హృతిక్, యల్లమాటి సుధాకర్, సర్పంచ్ పెదపూడి ఆనంద్‌బాబు, రమణారెడ్డి, హరిబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే ప్రజా సంక్షేమం



ఎమ్మెల్యే కోన సమక్షంలో పార్టీలో చేరిన మత్స్యకారులు

బాపట్ల: వైఎస్సార్ సీపీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. మత్స్యకార కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొక్కిలిగడ్డ చెంచయ్య ఆధ్వర్యంలో మత్స్యకారులు భారీగా వైఎస్సార్ సీపీలో శనివారం చేరారు. ఎమ్మెల్యే కోన రఘుపతి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. సంగాని పెద్ద సాంబయ్య, చింతా శ్రీను, కొక్కిలిగడ్డ దాస్, సంగానీ, పెసికం శింగయ్య, నాగేంద్రం పార్టీలో చేరారు.

నేడు విగ్రహాల ఆవిష్కరణ

భట్టిప్రోలు: వివేకానంద విగ్రహ సాధన కమిటీ ఆధ్వర్యంలో భట్టిప్రోలు బౌద్ధ స్తూపం సమీపంలో స్వాతంత్ర్యోద్యమ నాయకులు, స్వామి వివేకానంద, అల్లూరి సీతారామరాజు, సుభాష్ చంద్రబోస్, గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు, శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవం ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిటీ కన్వీనర్ బండారు శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, బౌడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

వరిగడ్డి వివాదంలో తోపులాట.. వ్యక్తి మృతి

కొల్లూరు: రోడ్డు మీద పడిన వరిగడ్డిని శుభ్రం చేసే విషయంలో చోటు చేసుకున్న వివాదం తోపులాటగా మారి ఓ వ్యక్తి ప్రాణం తీసింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పెసర్లంక రామన్నపేట ప్రాంతంలో నివాసముంటున్న సాత వీరశంకర్ (59) తన వరిగడ్డిని విక్రయించాడు. ట్రాక్టర్‌లో తరలించే క్రమంలో వారి ఇంటి ఎదురుగా ఉన్న గరికపాటి సీతమ్మ ఇంటి ముంగిట వరిగడ్డి పడింది. వరిగడ్డిని శుభ్రం చేయాలని సీతమ్మ ఉదయం నుంచి గొడవ చేస్తూ ఉంది. రాత్రి 8 గంటల ప్రాంతంలో వివాదం రెండు కుటుంబాల మధ్య తారస్థాయికి చేరుకుంది. సీతమ్మ, ఆమె కుమారుడు శివ వెంకటేశ్వరరావు, కోడలు దేవీ వీరశంకర్‌పైకి గొడవకి వెళ్లారు. మాటామాట పెరగడంతో శివ వెంకటేశ్వరరావు వీరశంకర్‌ను బలంగా నెట్టడంతో సీసీ రోడ్డుపై పడి అపస్మారక స్థితికి వెళ్లాడు. వెంటనే అతనిని బంధువులు తెనాలిలోని ఓ ప్రవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి వీరశంకర్ మృతిచెందాడు. మృతుడి కుమారుడు బాలసుబ్రమణ్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు కొల్లూరు ఎస్‌ఐ రాజీవ్‌కామ్యూల్‌కుమార్ తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

సంక్షిప్త వార్తలు

బాపట్ల టు హైదరాబాద్.. స్లీపర్ సర్వీస్

బాపట్లటౌన్: బాపట్ల నుంచి హైదరాబాద్‌కు నూతనంగా నాన్ ఏసీ స్లీపర్ సర్వీస్‌ను ఈ నెల 23న ప్రారంభించనున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం విజయకుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. స్లీపర్ బస్సు ప్రతి రోజు రాత్రి 10 గంటలకు బాపట్ల నుంచి బయల్దేరి పొన్నూరు, చేబ్రోలు, నారాకోడూరు మీదుగా హైదరాబాద్ (బీహెచ్‌ఈఎల్)కు తెల్లవారుజామున 4.45 గంటలకు చేరుకుంటుందని చెప్పారు. రాత్రి 9.20గంటలకు హైదరాబాద్ బయలుదేరి నుంచి ఉదయం 6 గంటలకు బాపట్ల చేరుకుంటుందన్నారు.

మే 14న భారీ ప్రదర్శన

బాపట్ల అర్బన్ డాక్టరు బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఏఎస్‌పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి మే 14 వరకు చేపట్టిన భారీ ప్రదర్శన చేపడుతున్నట్లు సంఘం అధ్యక్షుడు డాక్టర్ చార్వాక తెలిపారు. ఉత్సవాల కర పత్రాలను శనివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో ఆవిష్కరించారు. డాక్టరు చార్వాక మాట్లాడుతూ అంబేడ్కర్ 25 అడుగుల విగ్రహాన్ని స్థానిక చీలురోడ్డు సెంటర్‌లో ఏర్పాటు చేయాలని ప్రదర్శన చేపడుతున్నట్లు తెలిపారు. శీలంరోజన్‌బాబు, దాసరి లక్ష్మీ, చిన్న, డి.శ్రీకర్, రాజారావు, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

రేపల్లె రూరల్: మోర్తోట పంచాయతీ జంగాలవారిపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చెరుకుపల్లి కామాక్షి ఐ కేర్ వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. వైద్యులు వంద మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ కారాని కృష్ణకుమారి, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ఐలవరం(భట్టిప్రోలు): మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతులు అవలంభించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఐలవరం సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. గ్రామంలో శనివారం కౌలు రైతు ఎస్. శ్రీనివాసరావు సాగు చేసిన మొక్కజొన్న పంట క్షేత్ర ప్రదర్శన జరిగింది. నూజివీడు సీడ్స్‌కు చెందిన విన్నర్ మొక్కజొన్న పంటను ఒక సెంటు భూమిలో కోత ప్రయోగం చేపట్టగా ఎకరాకు 39 కింటాళ్ల దిగుబడి వచ్చిందని తెలిపారు. ఎంపీటీసీ మురుగుడు శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ గడ్డం శ్రీనివాసరావు, కంపెనీ ఆర్ఎం సీహెచ్ భాస్కర్, పోతురాజు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

అమృతలూరు(వేమూరు): ప్యాపర్రు గ్రామంలోని ఇందిర ప్రియదర్శిని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, మోపర్రు ఏఆర్‌సీ హాస్టల్ విద్యార్థులకు పాంచాళవారం గ్రామంలోని పాలకేంద్రం మాజీ అధ్యక్షుడు రామినేని చౌదరి, ప్రమీల దంపతుల జ్ఞాపకార్థం శనివారం మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్ దుప్పట్లు పంపిణీ చేశారు. గవిని రామోహన్, గవిని వెంకటేశ్వరరావు, పల్లికొండ రాజు, వేములపల్లి శ్రీధర్, ఎ.లక్ష్మీనారాయణ, కొండపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ఘంటసాల చైతన్య వేదిక మహాసభ

బాపట్ల: అఖిల భారత ఘంటసాల చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులో 12వ జాతీయ మహా సభ నిర్వహించనున్నట్లు ఎంతఓట నిరంజన్ తెలిపారు. శనివారం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో మహా సభల పోస్టర్లను ఆవిష్కరించారు. రాజీవ్‌గాంధీ కాలనీలో శ్రీ వేంకటేశ్వర స్కూలులో సభ జరుగుతుందని తెలిపారు. కోట వెంకటేశ్వరరెడ్డి, నాగేశ్వరరావు, స్వర్ణ చంద్రశేఖరరావు, శ్రీదేవి, రవికిరణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి

తెనాలిరూరల్: వాహనం అదుపుతప్పి పాస్టర్ మృతి చెందిన ఘటన తెనాలి మండలం హాఫ్‌పేట వద్ద శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బాపట్ల జిల్లా కొల్లూరుకు చెందిన గిరిగి శ్రీరాములు (54) గుంటూరు జిల్లా కొల్లిపర మండలం పిడపర్రు గ్రామంలో పాస్టర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం తన సంఘస్థుడు మోహనరావుతో కలిసి బైక్‌పై గుంటూరు వెళ్తుండగా హాఫ్‌పేట దాటాగానే వాహనం అదుపుతప్పి ఇద్దరు కింద పడ్డారు. ఘటనలో శ్రీరాములు గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు.